## కలెక్టర్‌ను కలిసిన శ్రీరాంపూర్ జీఎం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, జూన్ 16 : మంచిర్యాల కలెక్టర్‌గా కుమార్ దీపక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించగా, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సీసీసీ సింగరేణి అతిథి గృహంలో కలెక్టర్ కుమార్ దీపక్ దంపతులను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. గనులు, ఉత్పత్తి, ఓసీపీ ప్రభావిత ప్రాంతాల అంశాలను కలెక్టర్‌కు వివరించారు.

## కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జైనూర్, జూన్ 16 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు కుమ్రం భీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంత్రి సీతక్క ఇచ్చిన మాట ప్రకారం త్వరలో కుమ్రం భీం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెందోర్ గణపతి, అత్రం మాధవ్, కుమ్ర విట్టల్, ఆదివాసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

జన్నారం, జూన్ 16 : పొనకల్ గ్రామానికి చెందిన పీఆర్టీయూ క్రియాశీలక సభ్యుడు, ఉపాధ్యాయుడు ఎల్ దేవోజీ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు పీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి.. అ సంఘ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చెక్కును అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, పత్రిక సంపాదకుడు అర్ రవి, మండలాధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి నగురి సత్యనారాయణ, ఎంఈవో నడిమెట్ల విజయ్‌కుమార్, జాజాల శ్రీనివాస్, ప్రవీణ్ తిరుపతి పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఆర్కే-8 దవాఖానను
# 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలి

- టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్ డిమాండ్

శ్రీరాంపూర్, జూన్ 16 : సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్ ఏరియాలోనే కార్మికులు అత్యధిక ఉన్నారని, శ్రీరాంపూర్ ఆర్కే-8 దవాఖానను 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసి, అభివృద్ధి చేయాలని యాజమాన్యాన్ని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 50 పడకల దవాఖానగా మార్చి అన్ని రకాల వైద్య నిపుణులను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో యువ కార్మికులు, మహిళా ఉద్యోగులు ఎక్కువ మొత్తంలో ఉన్నందున ఆర్కే-8 డిస్పెన్సరీలో గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలోపెట్టుకొని యాజమాన్యం అన్ని కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్, శానిటేషన్ చేయించాలన్నారు. టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, బండి రమేశ్, మాజీ కార్యదర్శి పానగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, మైనింగ్ ఇన్‌చార్జి అన్వేష్‌రెడ్డి, నాయకులు సాదుల భాస్కర్, మహిపాల్‌రెడ్డి, డీ రవి, గోగర్ల గోపాల్, గొర్ల సంతోష్, రవిచంద్ర పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్‌కు కేంద్ర బింధువు యువత

- తాండూర్ పోలీస్ వాలీబాల్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

తాండూర్, జూన్ 16 : దేశ భవిష్యత్‌కు కేంద్ర బింధువు యువతేనని, వారు తలుచుకుంటే ఎన్నో విజయాలను సునాయాసంగా అందుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా తాండూర్ సీఐ కే కుమారస్వామి, పోలీసుల ఆధ్వర్యంలో మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. తాండూర్ సర్కిల్ పరిధిలోని భీమిని, కన్నెపల్లి, తాండూర్ మండలాల యువకులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ రవికుమార్ హాజరై, బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అంకుశం గ్రామానికి చెందిన సీ, ఏ, బీ టీంలు కైవసం చేసుకున్నాయి. శివప్రసాద్ (సీ) టీం ప్రథమ (రూ.10వేలు), సాయికుమార్ (ఏ) టీం ద్వితీయ (రూ.6వేలు), అభినాష నారాయణ (బీ) టీం తృతీయ (రూ.4వేలు) బహుమతి అందుకున్నాయి.


విన్నర్ టీం అంకుశం శివప్రసాద్ జట్టుకు బహుమతి, షీల్డ్ అందజేస్తున్న ఏసీపీ

అనంతరం ఏఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ.. క్రీడలోల గెలుపోటములు సహజమన్నారు. ముఖ్యంగా యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి, నాయకులు ఎండీ ఈసా, కడారి రత్నాకర్‌రావు, తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, భీమిని ఎస్ఐలు సీహెచ్ కిరణ్ కుమార్, విజయ్‌కుమార్, పీఈటీశ్రీనివాస్, కోచ్‌లు శంకర్, హన్మంతు, స్కోరర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'మందమర్రి'కి ఎన్నికలు నిర్వహించాలి

- పాలకవర్గం లేక కుంటుపడుతున్న అభివృద్ధి
- ఎన్నికల నిర్వహణ జేఏసీ డిమాండ్

మందమర్రి, జూన్ 16: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని, అడపాదడపా జరుగుతున్న పనుల్లో నాణ్యత కొరవడి పట్టణంలో అభివృద్ధి కుంటుపడుతున్నదని ఎన్నికల నిర్వహణ జేఏసీ నాయకులు అన్నారు. మందమర్రిని మున్సిపాలిటీగా ప్రకటించి దశాబ్దాలు గడుస్తున్నా గిరిజన ప్రాంతం పేరిట ఎన్నికలు నిర్వహించకపోవడంతో పట్టణ ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. స్థానిక సింగరేణి పాఠశాల అవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నిర్వహణ జేఏసీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం నోటిఫైడ్ ఏరియాగా ఉన్న మందమర్రిని మున్సిపాలిటీగా ప్రకటించిన అప్పటి ప్రభుత్వం, ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నించగా, కోర్టు స్టే మూలంగా ఎన్నికలు నిలిచిపోయాయని వారు తెలిపారు. సాధారణ ఎన్నికల సమయంలో తమను గెలిపిస్తే మున్సిపాలిటీకి పాలకవర్గ ఎన్నికలు నిర్వహించేందుకు కృషిచేస్తామని హామీలు ఇచ్చేవారే గానీ, నిర్వహించడం లేదని వారు తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం దశలవారీ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంఘాలతో పాటు, మేధావి వర్గాలను ఏకం చేసి, రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ జేఏసీ నాయకులు గుడికందుల రమేశ్, మొయ్య రాంబాబు, ముడారపు శేఖర్, తుంగపిండి ఉపేందర్, గంట రాకేశ్, దేవులపల్లి శ్రీనివాస్, తిరుపతి, సునార్కర్ రాంబాబు, బీరం రవి, రాయబారపు కిరణ్, మాయ శ్రీనివాస్, మ్యాజిక్ సాయి, కాసర్ల రంజిత్, బందెల కృష్ణ, సోనాల్ శర్మ, వంజారి వెంకటేశ్, మేడి రాజు, సాయి, ముల్కల్ల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


మందమర్రిలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు


